
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 16 ఏప్రిల్ 2023



తిరుపతి వైపు ...ఐటీ చూపు

డబ్ల్యుటిఐటిసి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి ఆపేటా భవనంలో శనివారం ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యూటిఐటిసి) కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కంపెనీ వారు ప్రధానంగా వివిధ దేశాలలో ఉన్న ఐటీ, నాన్ ఐటీ కంపెనీలతో సమన్వయం చేసి మన ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేలా మధ్యవర్తిత్వం వహిస్తుందని ఆ కంపెనీ సీఈఓ సందీప్ మత్కల అన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి కానీ, అపెటా ప్రతినిధులు చెవిరెడ్డి హేమచంద్రా రెడ్డి, కిరణ్ కాని ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వారి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని ఇక్కడ పెట్టుబడులు ప్రోత్సాహించేందుకు తమ వంతు కషి చేస్తామని ఆయన తెలియజేసారు. అనంతరం ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి వారి ఆదర్వంలో ఐటీ, నాన్ ఐటీ రంగాలకు చెందిన 15 కంపెనీల సీఈఓలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి ప్రారంభోపన్యాసం చేస్తూ తిరుపతి పట్టణంలో ఐటీ కంపెనీల స్థాపనకు ఆసక్తి చూపుతూ ఇక్కడికి విచ్చేసిన కంపెనీల సీఈఓలకు, ప్రతినిధులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. నేడు తిరుపతి ఐఐటీ, ఐజర్, ఎస్వీ యూనివర్సిటీ, పద్మావతి యూనివర్సిటీ లాంటి ప్రఖ్యాత విద్యా సంస్థలతో విరాజిల్లుతోంది. ఈ విద్యా సంస్థల నుండి ప్రతి ఏటా వేల సంఖ్యలో విద్యార్థులు ఉత్తీర్ణులు అవుతున్నారు. తిరుపతిలో ఐటీ కంపెనీల స్థాపించి పెట్టుబడులు పెట్టడం వలన మొదటగా ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరుల అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో సూట్స్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి దేవదేవుని చెంత తమ కంపెనీ నెలకొల్పే అవకాశం రావడం అదష్టంగా భావిస్తున్నామని 300 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు ఎంఓయు కుదుర్చుకొన్నామని, తద్వారా సుమారుగా 2వేల మందికి ఉపాధి కల్పించనున్నామని చెప్పారు. డిజితాన్ చైర్మన్ సందీప్ కుమార్ మత్కల్ మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా తిరుపతిలో ప్రముఖ విద్యా సంస్థలు ఉన్నాయని తద్వారా నాణ్యమైన మానవ వనరులు అందుబాటులో ఉంటాయని 100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎంఓయులు జరిగాయని, తద్వారా సుమారు 300 మందికి ఉపాధి కల్పించానున్నామని చెప్పారు. సైమ్యాక్స్ ఇన్వోట్కన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ ఎం.గౌరీశంకర్ మాట్లాడుతూ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో తన విద్యాభ్యాసం కొనసాగిందని వ్యాపార విస్తరణలో భాగంగా తిరుపతి అభివద్ధిలో భాగమయ్యే అవకాశం దొరికిందని, సుమారు 100 కోట్ల పెట్టుబడి పెట్టనున్నామని, తద్వారా సుమారు 250 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అన్నారు. ఎస్ఆర్ఆర్ క్లౌడ్ ఎక్సుర్ఫ్ గురూ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 10 కోట్లతో 100 మందికి ఉద్యోగ కల్పన, సైబర్ కోంబాట్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రై.లి 10 కోట్లతో 50 మందికి ఉద్యోగ కల్పన, వేల్ ఐటీ సొల్యూషన్స్ 10 కోట్లతో 150 మందికి ఉద్యోగ కల్పన, ఫ్యూజెనిక్ పవర్ సొల్యూషన్, ఐడియావటర్ సొల్యూషన్స్ ప్రై.లి 10 కోట్లతో 100 మందికి ఉపాధి కలిపించనున్నామని ఆ కంపెనీ ప్రతినిధులు తెలియజేసారు.



టిటిడి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల నియామకం

టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వెల్లడి

ప్రజాశక్తి - తిరుమల

తిరుపతిలోని స్విమ్స్ పరిధిలో గల శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాలలో టిబి, చెస్ట్, స్కిన్ ఇతర ఐసోలేషన్ వార్డులు, స్టాఫ్ క్వార్టర్స్, హాస్టళ్ల నిర్మాణ పనుల కోసం రూ.53.62 కోట్లు మంజూరు చేసినట్టు టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. టిటిడి ధర్మకర్తలమండలి సమావేశం శనివారం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వెల్లడించారు. టిటిడి అవసరాలకు గాను ప్రకతి వ్యవసాయం ద్వారా పండించిన 12 రకాల ఉత్పత్తుల కొనుగోలుకు ధరల నిర్ణయంపై రైతు సాధికార సంస్థ, మార్క్‌ఫెడ్‌తో చర్చించేందుకు టీటీడీ బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సనత్ కుమార్, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తో కమిటీ ఏర్పాటు చేశారు. అలిపిరి మార్కెటింగ్ గోడౌన్ వద్ద నూతన గోడౌన్ల నిర్మాణానికి రూ.18 కోట్లు, కోల్డ్ స్టోరేజి నిర్మాణానికి రూ.14 కోట్లు కేటాయించారు. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఆధునీకరణ పనులకు రూ.3.12 కోట్లతో టెండరుకు ఆమోదం తెలిపినట్టు చైర్మన్ వెల్లడించారు. న్యూఢిల్లీలోని ఎస్వీ కళాశాలలో ఆడిటోరియం అభివద్ధి పనుల కోసం రూ.4 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపారు. టిటిడి విద్యాసంస్థల్లో రెగ్యులర్ బోధనా సిబ్బంది నియామకానికి ఆమోదం తెలిపారు. ఇప్పటికే పని చేస్తున్న కాంట్రాక్ట్ బోధనా సిబ్బందిని కొనసాగిస్తూనే రెగ్యులర్ ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి ఆమోదం తెలిపారు. ఢిల్లీలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మే 3 నుంచి 13వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీనివాస సేతు పనులను త్వరితగతిన పూర్తి చేసి జూన్ 15వ తేదీ నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఎఫ్.సి.ఆర్.ఏ (విదేశీ విరాళాల స్వీకరణ చట్టం) ప్రకారం విదేశీ భక్తుల నుండి విరాళాలు స్వీకరించడానికి టిటిడికి అనుమతి ఉందని, ఈ అనుమతి 2020 జనవరికి ముగిసిందని, దీనిని రెన్యువల్ చేసుకోవడానికి టిటిడి దరఖాస్తు చేసిందని తెలిపారు. ఎఫ్.సి.ఆర్.ఏ, రాష్ట్ర దేవాదాయ శాఖ చట్టాల మధ్య ఉన్న సాంకేతిక కారణాల వల్ల విరాళాల డిపాజిట్లపై వచ్చే వడ్డీని చూపించడంలో కొన్ని అభ్యంతరాలు తెలిపారు. ఇది సాంకేతిక కారణం మాత్రమేనని, ఎఫ్.సి.ఆర్.ఏ అధికారుల సూచన మేరకు త్వరగా లైసెన్స్ రెన్యువల్ చేసుకోవడానికి రూ.3 కోట్లు చెల్లించడం జరిగిందని, ఇందుకోసం చెల్లించిన రూ.3 కోట్ల సొమ్మును తిరిగి పొందడానికి కషి చేస్తున్నామని తెలిపారు. మీడియా సమావేశంలో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, పోకల అశోక్ కుమార్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్ పాల్గొన్నారు.



టిటిడి బోర్డులో అటవీకార్మికుల ఊసేలేదు : సిఐటియు

తిరుపతి టౌన్ : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశంలో 900 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అటవీ కార్మికుల గురించి చర్చించి ఓ నిర్ణయం చేయకపోవడం సమంజసం కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. ధర్మాన్ని రక్షించండి ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందని ప్రతినిత్యం ప్రచారం చేసే టిటిడి పేద అటవీ కార్మికుల పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర హైకోర్టు చెప్పిన సూచనలను పాటించకుండా, తాను చేసిన తీర్మానాన్ని సైతం బోర్డు అమలు చేయకుండా, 362 మంది కార్మికుల్లో 162 మందిని పర్మినెంట్ చేసి 200 మందిని వీధుల పాలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ వివక్షకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. దేవదేవుని ఎదుటే యాజమాన్యం పేద కార్మికుల పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. టిటిడి యాజమాన్యం అటవీ కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు



గంగ జాతరలోపే రోడ్డు పూర్తవ్వాలి

తిరుపతి టౌన్ : తిరుపతి తాతయ్యగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డును ఏప్రిల్ 30వ తేదీకి అందుబాటులోకి తీసుకురావాలని మేయర్, ఉప మేయర్ అధికారులను, కాంట్రాక్టర్లు ఆదేశించారు. శనివారం ఉదయం మాస్టర్ ప్లాన్ రోడ్డు సంబంధించి పనులను పరిశీలించారు. మే మొదటి వారంలో గంగ జాతర ఉత్సవాలు జరుగుతాయని, అందుకు ఏప్రిల్ 30వ తేదీకి పనులు పూర్తిచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై ఐదుశాతం రాయితీ

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని భవన యజమానులు, ఖాళీ జాగా యజమానులకు ఈ ఆర్థిక ఏడాదికి సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఈనెల ఏప్రిల్ 30వ తారీకు లోగా ఏక మొత్తంగా చెల్లించి 5 శాతం రాయితీ పొందగలరని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత గుడ్ న్యూస్ తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయము నందు ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ నందు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పన్నులు చెల్లించవచ్చునని, సెలవు రోజుల్లో పన్నులు చెల్లించి ఐదు శాతం రాయితీ పొందగలరని కమిషనర్ తెలిపారు.

దళితులపై దాడిచేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అంబేద్కర్ జయంతి రోజున రామచంద్రాపురం మండలం నడవలూరు అయ్యేవై కాలనీ దళితవాడకు చెందిన మురళి, మణికంఠలపై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం, సిపిఐ, ఆర్.పి.ఐ, ఆమ్ ఆద్మీ పార్టీ, కెవిపిఎస్, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ దళితులైన మురళి. మణికంఠలకు చెందిన టాటా ఏసీ వాహనాన్ని రోడ్డు పక్కనే పార్కింగ్ చేశారని నెన్నూరుకు చెందిన టిడిపి మాజీ వైస్ ఎంపిపి మధుసూదన్‌రెడ్డి అనుచరులు కులం పేరుతో దూషించి దాడిచేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి దళితులకు న్యాయం చేయాలని, లేదంటే రామచంద్రాపురంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ దళితుల పట్ల పెత్తందారులు దురహంకారం పోలేదని విమర్శించారు. దాడికి గురైన దళితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఇలాంటి ఘటన జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్ పి ఐ దక్షిణ భారత అధ్యక్షులు పి అంజయ్య మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి రోజు కూడా దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దళితులపై దాడి చేసి వారిని కులం పేరుతో తిట్టడం సిగ్గుచేటు అన్నారు. వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు నగేష్ కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ డి శీను, దళిత నాయకులు పరుశురాం, సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ కష్ణ, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, గీత, వి ఎస్ మన్యం దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు



నేడు యుపిఎస్‌సి పరీక్షలు: ఆర్‌డిఓ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈ నెల 16 న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ కంబైండ్ డిఫెన్స్ సర్వీసెస్ –, నేషనల్ డిఫెన్స్ అకాడమి – , నావల్ అకాడమి – పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తిరుపతి ఆర్.డి.ఓ., పరీక్షల కస్టోడియన్ వి.కనకనరసా రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్.డి.ఓ. కార్యాలయంలో యు.పి.ఎస్.సి. పరీక్షల నిర్వహణపై ఆర్.డి.ఓ., యు.పి.ఎస్.సి.న్యూ ఢిల్లీ సూపరింటెండెంట్ శ్రీరామ్ సమీక్ష నిర్వహించారు. ఆర్‌డిఓ మాట్లాడుతూ అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఐ.డి. ప్రూఫ్ తీసుకుని రావాలని, ఎలక్ట్రానిక్ వస్తువులు, క్యాలికులేటర్ వంటివి పరీక్షా కేంద్రాలలోకి అనుమతి ఉండదని అన్నారు. పరీక్షా సమయానికి 10 నిమిషాల ముందుగానే ప్రధాన ద్వారాలు మూసివేస్తారని అన్నారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎస్.పి.డి.సి.ఎల్. వారికి సూచించారు. ఈ సమీక్షలో తహశీల్దార్లు సుబ్రహ్మణ్యం, రోశయ్య, ద్వారకానాథ రెడ్డి, ప్రమీల, పరీక్షా కేంద్రాల సూపర్‌వైజర్లు ఎ.పి.ఎస్.పి.డి.సి.ఎల్. శ్రీనివాసుల నాయుడు, పోస్టల్ శాఖ రెడ్డెప్ప, స్పెషల్ బ్రాంచ్ శ్రీనివాసులు, మెడికల్ డా.ఊర్మిళ, డి.టి. లు లక్ష్మీనారాయణ, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



పనులు పూర్తిచేయని కాంట్రాక్టర్లకు నోటీసులు : కమిషనర్

తిరుపతి టౌన్ : తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నిర్వహణలో చేపట్టిన పనులను ఇచ్చిన సమయాని కల్లా పూర్తి చేయించాల్సిన భాధ్యత అధికారులపై వున్నదని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాంబర్లో శనివారం ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమిక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే పనులు జరుగుతున్నవి, అదేవిధంగా అనుమతులు తీసుకొని పనులు ప్రారంభించి పూర్తి చేయకుండా పెండింగులో వున్న పనులను ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. పనులు జరగకుండా జాప్యం చేస్తే కాంట్రాక్ట్ ను రద్దు చేయాల్సి వస్తుందనే విషయాన్ని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయించాలన్నారు. వేసవికాలంలో నీటి సదుపాయానికి అంతరాయం రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.



18 నుంచి పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి..!

ప్రజాశక్తి - గూడూరు టౌన్

తిరుపతి జిల్లాలోని గూడూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు 18వ తేదీ నుండి సమ్మెలోకి వెళుతున్నట్లు వెల్లడించారు. శనివారం సిఐటియు. కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు. , ఎఐటియుసి. నాయకులు దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. గూడూరు మున్సిపాలిటీ గ్రేడ్ వన్ అయినప్పటికీ పట్టణంలో రావలసిన ఇంటి పన్నులు, కుళాయి పన్ను, ఖాళీ స్థలం పన్ను, షాపింగ్ కాంప్లెక్స్ బాడుగలు, వివిధ రకాల రూపంలో నిధులు మున్సిపాలిటీలో సమకూరుతున్నా పారిశుధ్య కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రతిరోజూ పురవీధులు శుభ్రం చేస్తూ, కాల్వలు, మురికివాడలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులను వేధింపులకు గురిచేస్తూ కమిషనర్ జీతభత్యాలు ఇవ్వడం లేదని వాపోయారు. జీతభత్యాలు, ఇఎస్ఐ, పిఎఫ్, 90 మందికి రావాల్సిన హెల్త్ అలవెన్స్‌లు, ఏడుగురికి పదినెలల జీతాలు, మృతుల కుటుంబాలకు వారసులకు పనులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్ల రిటైర్మెంట్ వయస్సు పొడిగించినప్పటికీ ప్రస్తుత కమిషనర్ పట్టించుకోకుండా ముగ్గురిని పనిలోనుంచి తొలగించారన్నారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ దాటవేస్తున్నారని, కార్మికులకు రావాల్సిన పనిముట్లు, పరికరాలు ఇప్పించకపోగా సబ్బులు, నూనెలు, చెప్పులు, గ్లౌజులు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జీతభత్యాలను ప్రతినెలా ఇవ్వకుండా, మొక్కుబడిగా ఒకనెలా, రెండు నెలలు వేస్తున్నారని వాపోయారు. మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యవైఖరి వల్ల కొంతమంది కార్మికులు సైతం మృతిచెందారన్నారు. జనవరి 30, 31 తేదీల్లో పారిశుధ్య కార్మికులు రిలేదీక్షలు చేపట్టాగా ఎంఎల్ఏ వరప్రసాద్‌రావు చర్చలు జరిపి పారిశుధ్య కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేవారు. ఎంఎల్ఏ మాటలు నమ్మి దీక్షలు విరమించినా ఇంతవరకూ సమస్యలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు స్పష్టం చేవారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, ఎంఎటి చంద్రయ్య, బి.గోపీనాథ్, డపాల ప్రసాద్, ఎస్.సురేష్, బివి రమణయ్య, మున్సిపల్ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి పెంచల ప్రసాద్, శాంతివర్ధన్, మణి, మహేష్ పాల్గొన్నారు.

బీజేపీ చెర నుంచి దేశాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/ గూడూరు టౌన్

బిజెపి చెర నుంచి దేశాన్ని కాపాడుకుందామని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. సీపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ప్రచార యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు పరచడం లో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏపీలో అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ వ్యక్తులకు అప్ప చెప్పే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. ఈ ప్రచార కార్యక్రమం లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, జనమాల గురవయ్య, గోపి, శివ, మురళి, కుప్పమ్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు పట్టణంలోని గమాళ్లపాలెంలోని సిపిఐ కార్యాలయం నుంచి అశోక్‌నగర్, అరుంధతియపాలెం మీదుగా ప్రచారభేరి యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతి వ్యక్తీ గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీసి అడగాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో పామంజి మణి, బి.చంద్రయ్య, వెంకట్రావు, అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, ఎంబెటి చంద్రయ్య పాల్గొన్నారు.



ఆలయాల దర్శనానికి ‘బైక్’లు అద్దెకు!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతిలో కొత్తగా రెంట్ బైకులు అందుబాటులోకి వచ్చాయి. 24 గంటలకు 600 రూపాయలు తీసుకుంటున్నారు. తిరుపతి లోకల్ దేవాలయాలన్నీ చూడటానికి, కొండపైన ఘాట్ రోడ్ మంచి డ్రైవింగ్ ఎక్స్పీరియన్స్ ఒక వెయ్యి రూపాయల తో ఇద్దరు తిరుపతి లోకల్ దేవాలయాలు కాళహస్తి, కాణిపాకం, చంద్రగిరి కోట, శ్రీనివాస మంగాపురం, వకుళ మాత టెంపుల్, తిరుచానూరు, కపిల తీర్థం, ఇస్కాన్ టెంపుల్, గోవిందరాజు స్వామి గుడి, కోదండ రామస్వామి ఆలయం, జూ పార్క్, పాపవినాశనం, శ్రీవారి పాదాలు అన్నీ కూడా మనకు నచ్చిన సమయంలో నచ్చిన విధంగా ఓపికగా చూడవచ్చు. రైల్వే స్టేషన్‌కు వద్దకే వచ్చి కోరిన వారికి బైక్‌లు అందిస్తారు. ఈ బైక్‌లు అందించే సర్వీసు 24 గంటలు అందుబాటులో ఉంటుంది. హాతిరామ్ ట్రావెల్స్, 9989589251, 7671029282 ఫోన్ నంబర్లకు కాల్ చేయవచ్చు.



ఆలయానికి ఐదు ఆర్వో ప్లాంట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ దివీస్ ల్యాబోరేటరీస్ అధినేత మురళి ఐదు ఆర్వో ప్లాంట్లను వితరణ చేస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి జలప్రసాదం వద్ద ఈ ప్లాంట్ల ఏర్పాటుకు శనివారం భూమి పూజ చేశారు. ఈ నెల 27వ తేదీన ఆర్వో ప్లాంట్లు ప్రారంభిస్తామనీ, వేసవి దప్పా ఏర్పాటు చేస్తున్న దాతకు ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు కతజ్ఞతలు తెలిపారు.



ఈసురోమంటున్న ‘ఉపాధి’

- సరాసరి 50 రోజులే పని దినాలు
- జిల్లాలో 100 రోజుల ఉపాధి హుళక్కే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గ్రామీణ పేదలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంపై నీలినీడలు కమ్ముకొంటున్నాయి. బడ్జెట్ కేటాయింపుల కుదింపుకు తోడు నిధుల విడుదలలో జాప్యం, పర్యవేక్షణ లోపం, అసంబద్ధ నిబంధనలు వెరసి ఆ పథకం అమలుకు ప్రతిబంధకంగా మారాయి. ముఖ్యంగా రాష్ట్రాలపైనే అమలు భారం మోపాలన్న ప్రతిపాదనలు మరింత ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ప్రతి కూలీకి కనీసం వంద రోజులు పనిదినాలు కల్పించాలనే నిబంధన ఉన్నా, సరాసరి కేవలం 50 రోజులు మాత్రమే పనులు కల్పించడం ఈ పథకం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపుతున్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. ఉపాధి హామీ పథకం కింద దేశంలో ఆరేళ్లుగా కూలీలకు ఏటా సగటున 50 రోజుల కంటే తక్కువగానే పని దక్కింది. ఈ సమాచారాన్ని ఇటీవలి పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వమే వెల్లడించింది. దీనికి తగ్గట్లుగానే తిరుపతి జిల్లాలో ఈ పథకం ఈసురోమంటోంది.

ఉపాధి హామీ పథకంలో మోడీ ప్రభుత్వం తనదైన ముద్రను చాటేందుకు మార్పులు చేర్పులు చేపట్టి కొత్తకొత్త నిబంధనలను తెస్తున్నట్లు నిపుణులు విమర్శిస్తున్నారు. నిధుల కొరతకు తోడు ఇతర కారణాల వల్ల ప్రతి సంవత్సరం 100 రోజుల పనులను కేంద్రం కల్పించడం లేదు. 2021-22లో సగటున 50 రోజులు, 2020- 21లో 52 రోజులు మాత్రమే పని దక్కిందని జాతీయ లెక్కలు చెబుతున్నాయి. తిరుపతి జిల్లాలో సుమారు రెండు లక్షలా 80 వేలకు పైగా జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలున్నాయి. వీరిలో 50శాతం కుటుంబాలు కూడా 50 రోజుల పని దినాలు పూర్తి చేసుకోని పరిస్థితి. శ్రీకాళహస్తి డ్వామా క్లస్టర్ లో 61 వేలకు పైగా జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో 50 వేలకు పైగా కార్డులు యాక్టీవ్ లో ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 40 వేలకు పైగా కుటుంబాలు ఉపాధి పనులకు వెళ్ళగా కేవలం 4 వేల కుటుంబాలు మాత్రమే వందరోజులు పూర్తి చేసుకోవడం గమనార్హం.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

ఉపాధి పథకానికి బడ్జెట్ కేటాయించడంలో, కూలీలకు బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. కేంద్రం సరైన శ్రద్ధ చూపకపోవడం వల్ల రాష్ట్రానికో తీరుగా చెల్లింపులు జరుగుతున్నాయి. జాతీయ మొబైల్ పర్యవేక్షక వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్) కింద రోజువారీగా కూలీల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఇంటర్నెట్ సేవలు అంతంత మాత్రంగానే ఉండడంతో కూలీల నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. మరోవైపు చెల్లింపుల కోసం జాబ్‌కార్డుకు ఆధార్, బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేయాలన్న నిబంధన తెచ్చారు. చాలామంది ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లడం, బ్యాంకు ఖాతాలు లేకపోవడం వంటి కారణాలతో చెల్లింపులు జరగడం లేదు. కేంద్రం 2022-23 బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రూ. 73 వేల కోట్లను కేటాయించింది. సవరించిన అంచనాల్లో అది రూ. 89 వేల కోట్లను దాటింది. అంతకు ముందు బడ్జెట్లో రూ.73 వేల కోట్లు కేటాయించారు. ఇటీవలి పద్దులో మాత్రం నిరుటితో పోలిస్తే నిధులను భారీగా తెగ్గోసి రూ.60 వేల కోట్లే కేటాయించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా పేర్లు నమోదు చేసుకున్న కూలీలకు సరిగ్గా పనులు దొరకని పరిస్థితి నెలకొంది. నిధులకు కత్తెర వేయడం వల్ల మరింత మంది ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇటీవల కేంద్ర గ్రామీణాభివద్ధి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ చేసిన ప్రకటన పిడుగుపాటులా పరిణమించింది. పథకం నిధులను 60శాతం కేంద్రం ఇస్తూ రాష్ట్రాలు మరో 40శాతం భరించాలనే ప్రతిపాదనను ఆయన తెచ్చారు. తద్వారా పథకం అమలులో అవినీతిని కట్టడిచేయడానికి రాష్ట్రాలు కషి చేస్తాయని ఆయన విశ్లేషించారు. వాస్తవానికి కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి పథకాలు సరిగ్గా అమలు కావడం లేదు. అందువల్ల ఉపాధి హామీ పథకాన్ని కేంద్రమే పూర్తిగా, సమర్థంగా అమలు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.



150 పని దినాలు కల్పించాలి: రాజా, ఉపాధి కూలీ, బోనుపల్లి

గతంలో ఉపాధి పనులు చేతి నిండా ఉండేవి. గత పదేళ్లుగా కూలీలకు పనులు తగ్గి పోయాయి. ఏడాదికి 50 పని దినాలు చేస్తే గొప్పేననుకోవాలి. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు బాగా తగ్గిపోయాయి. యువత ఉపాధి కోసం ఉపాధి హామీ పథకాన్ని ఎంచుకుంటోంది. ఈ క్రమంలో దానికీ గండి కొట్టాలని చూడటం దుర్మార్గం. కనీసం కుటుంబానికి 150 పని దినాలు కల్పించాలి.

ప్రభుత్వాసుపత్రిలో ఆరోనెలలోనే ప్రసవం



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట ప్రభుత్వాసుపత్రిలో ఆరోనెలలోనే ఓ వివాహిత మగ బిడ్డకు శనివారం జన్మనిచ్చింది. నాయుడుపేట మండలం భట్టివిడతల గ్రామానికి చెందిన ఈగ కల్పనకు పుదురుకు చెందిన వెంకటేశ్వర్లుతో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆరు నెలల క్రితం తొలిసారి గర్భం దాల్సిన ఆమె నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ పరీక్షలు చేయించుకుంటోంది. ఆరో నెల ప్రారంభంలో పరీక్షల నిమిత్తం శనివారం ఉదయం హాస్పిటల్ కు వెళ్లగా ఒక్కసారిగా నొప్పులు మొదలవడంతో డ్యూటీ డాక్టర్ జె.మోహన సాయిరూప ఆధ్వర్యంలో ఉదయం 10.35 గంటలకు ఆమె 750 గ్రాముల మగ బిడ్డకు జన్మనిచ్చింది తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఉండాల్సిన బరువుకంటే బిడ్డ బరువు చాలా తక్కువగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం నెల్లూరుకు తీసుకెళుతున్నారని ఇన్‌ఛార్జి డాక్టర్ పి ఎన్ అమరనాథ్ తెలిపారు. వారితోపాటు డాక్టర్ కె. వెంకటరత్నం ఉన్నారు.

'కోడికత్తి ఆరోపణలు అబద్దాలు'

ప్రజాశక్తి-కోట: కోడి కత్తి దాడి ఘటనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి టీడీపీపై చేసిన ఆరోపణలన్నీ అబద్దాలని జాతీయ దర్యాప్తు సంస్థ విచారణలో తేలిపోయిందని.. టీడీపీ తిరుపతి జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా శనివారం కోటలో ఆయన మాట్లాడుతూ కోడి కత్తి దాడిపై వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తనకు రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదని.. జాతీయ దర్యాప్తు సంస్థతో విచారణ చేయాలని కోరారన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ విచారణ చేపట్టిన క్రమంలో కోడి కత్తి దాడిపై వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ఆరోపణలన్నీ అబద్దాలని జాతీయ దర్యాప్తు సంస్థ పేర్కొంది. అధికారంలోకి వచ్చేందుకు 45 సంవత్సరాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు పింఛన్లు, సంపూర్ణ మద్య నిషేధం, సీపీఎస్ రద్దు, అగ్రిగోల్డ్ బాధితులకు ఆరు నెలలలోగా పూర్తి స్థాయి చెల్లింపులు, వంటి ప్రధాన హామీలతోపాటు అమలు చేయని అనేక వాగ్ధానాలతో ప్రజలను మోసం చేసిన విధంగానే, తన బాబాయి వివేకానందరెడ్డి హత్యలో, కోడి కత్తి దాడిలో టీడీపీ ప్రమేయం ఉందంటూ తన సాక్షి పత్రిక ద్వారా అసత్య ప్రచారం చేసి లబ్ధి పొందిన వైయస్ జగన్మోహన్ రెడ్డిపై సానుభూతి ప్రదర్శించిన రాష్ట్ర ప్రజలే ఆగ్రహంతో రగిలిపోతున్నారని వాపోయారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైయస్ జగన్మోహన్ రెడ్డిని గద్దె దించడమే కాకుండా మోసపూరితమైన, కుట్రపూరితమైన ప్రవర్తనకు తగిన శిక్ష అనుభవించిన తప్పదని వివరించారు.

అన్నా క్యాంటీన్‌తో సంత రైతులకు భోజనం



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని ఆదేశాల మేరకు వారంలో ప్రతి శనివారం సంతలో వ్యాపారం చేసుకునే రైతులకు అన్నా క్యాంటీన్‌తో అన్నదానం కార్యక్రమాన్ని మండల టిడిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ మాట్లాడుతూ పండించిన పంటలను వ్యాపారం చేసుకోవడానికి సంతకు వచ్చే రైతులుకు అన్నా క్యాంటీన్‌తో ఉచితంగా ప్రతి శనివారం 300 మందికి పైగా అన్నదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో స్థానిక శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ చక్కటి ఫోటోలతో నాణ్యమైన క్యాలెండర్ ముద్రణ చాలా బాగుందని, ఫోటో జర్నలిస్టుల ప్రాముఖ్యత తెలిపే విధంగా క్యాలెండర్ ముద్రించారని అభినందించారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఫోటో జర్నలిస్టులు చాలా ఐక్యమత్యంగా ఉంటారని, వారి కార్యక్రమాలు భిన్నంగా ఉంటాయన్నారు. తిరుపతి గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి అధికారిక ప్రకటన చేయించడంలో ప్రత్యేక కృషి చేసిన ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డికి పాత్రికేయుల తరపున చిరు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు కె. రాధాకష్ణ, కే. గిరిబాబు, తిరుపతి ప్రెస్ క్లబ్ కార్యదర్శి పి. బాలచంద్ర ఎలక్ట్రానిక్ మీడియా మాజీ జిల్లా అధ్యక్షులు ఆర్. మురళీకృష్ణ, సీనియర్ ఫోటో జర్నలిస్ట్ లు రమేష్ కుమార్, లావణ్య కుమార్, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోసగాళ్లపై చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో స్థిరపడి అక్కడ సంపాదించిందంతా తన రక్త సంబంధీకులకు ఇచ్చి వారి చేతిలో మోసపోయానని ఎన్.మధుసూదన్ రెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1999లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూ అమెరికాలోనే స్థిరపడ్డానన్నారు. అయితే అన్న చంద్రశేఖర్ రెడ్డి, తమ్ముడు దామోదర్ రెడ్డి (మాజీ సర్పంచ్ కొత్త మంగళం), అక్క గంపల ఉషారాణి భర్త గంపల వెంకటరమణ రెడ్డి(టిటిడి ఉద్యోగి), చెల్లెలు బొందు అశోక్ రాణి భర్త టిటిడి ఉద్యోగి బొందు మధుసూదన్‌రెడ్డిలు కలిసి తన ప్రమేయం లేకుండానే పిత్రార్జితమైన భూములను విడిచిపెట్టకుండా 2007లో రెవెన్యూ అధికారులతో ఎన్. చంద్రశేఖర్ రెడ్డి పట్టాదారు పాసు పుస్తకాన్ని పొందారన్నారు. రెవెన్యూ అధికారులు సదరు భూమిపై ఎటువంటి లావాదేవీలు జరుపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల మూడో తేదీ నుంచి గూడూరు పట్టణంలో ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఐదు కేంద్రాలలో శనివారం ముగిశాయి. పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

పైసలకే పట్టాలు..!



రెవెన్యూ అధికారుల మాయాజాలం
భూపంపిణీలో తొలగించిన పేర్లు
ఆందోళనలో నిండలి నిరుపేదలు

ప్రజాశక్తి-బాలాయపల్లి

అసైన్డ్ మాయాజాలం కొందరికి కాసులు కురిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గాయాలి, అనాధీనం భూములను సాగుచేసుకుంటున్న పేదలకు హక్కులు కల్పిం చేందుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో బాలాయపల్లి మండలం నిండలి గ్రామంలో కొత్త చెరువు పొరంబోకు (వాగు చెరువులోకి వస్తున్న వర్షం నీరు) సర్వే నెంబరు 119/3 కొమ్మి శంకరయ్యనాయుడు,127/7 లో కొమ్మి నాగయ్యనాయుడు ఆయన భార్య కొమ్మి జయమ్మకి 119/7 లో వాక్యం గ్రామానికి చెందిన వారికి పట్టాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధం కావడం గమనార్హం.

గ్రామాల్లో పట్టాలు ఇప్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు ప్రజల నుంచి లక్షలు రూపాయలు వసూళ్లు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో అసైన్‌మెంట్ లిస్ట్ తయారీలో అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివాదాస్పదంగా ఉన్న భూములను అసైన్‌మెంట్ లిస్టులో ప్రవే శపెట్టకూడదని తెలిసినా అధికారులు అవేమీ తమకు వర్తించవంటూ వ్యవహరిస్తున్నారు. కాసులిస్తే ఏమైనా చేసేయచ్చు అన్న విధంగా నిండలి, వాక్యం గ్రామంలో ఏడో విడత భూపంపిణీలో గతంలో ఎస్సీలకు పట్టాలు ఇచ్చేందుకు కేటాయించిన భూములను అక్రమంగా ఆక్రమణ చేసుకున్న భూస్వాములకు పట్టాలు ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేయడం చూస్తుంటే అధికారులు ఏమేర భూస్వాములతో కుమ్మక్కు అయ్యారో అర్థమవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆక్రమణలు తొలగించాలి

భూదాహంతో భూములు ఆక్రమించి పేదలను భయభ్రాంతులకు గరిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు భూఆక్రమణదారులు చేయి తడపడంతో ఆక్రమణలను తొలగించకుండా వారిపై కేసులు పెడుతామని బెదిరించడం దారుణం. ఇకనైనా భూమిలేని పేదలను గుర్తించి పట్టాలు ఇవ్వాల్సిన అధికారులు అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై అందినకాడికి వసూళ్లు చేసుకుని నిజమైన లబ్ధిదారులను గుర్తించకుండా భూములున్న వారికే ప్రభుత్వ భూములను పంపిణీ చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో అసైన్డ్ లిస్ట్ తయారీ లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకే అసైన్డ్ భూములు



బాలాయపల్లి మండలం నిండలి గ్రామంలోని అసైన్డ్ భూములు భూస్వాములకే ఇస్తున్నారు. ప్రభుత్వం గాయాలి, అనాధీనం భూములను సాగుచేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించేందుకు ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. నిండలి గ్రామంలో కొత్త చెరువు పొరంబోకు స్థలంలో కొందరికి పట్టాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధం కావడం దారుణం. పేదలకు పంపిణీ చేయకుంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– వందవాసి నాగరాజు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి

సాగు భూములు ఇతరులకు ఇస్తున్నారు



తాము సాగు చేసుకుంటున్న భూములను రెవెన్యూ అధికారులు లంచం తీసుకుని ఇతరులకు అసైన్ మెంట్ కమిటీలో వేరే వాళ్లకు భూములు ఇస్తున్నారు. ఉన్నతాధాధికారులు చర్యలు తీసుకోవాలి.

- బుజ్జమ్మ, వాక్యం గ్రామం, బాలాయపల్లి మండలం

అధికారులు అన్యాయం చేస్తే ఊరుకోం



గతంలో ఏడో విడత భూ పంపిణీలో తమ సాగు చేసుకుంటున్నామని గుర్తించి తమ పేర్లు పొందుపరిచారు. ప్రస్తుతం ఆ పేర్లు తీసేసి వేరే వారికి మా భూములకు పట్టాలి ఇస్తున్నారు. అధికారులు అన్యాయం చేస్తే ఊరుకోం. ఆత్మహత్యలో శరణ్యం.

– కృష్ణమ్మ, వాక్యం గ్రామం, బాలాయపల్లి మండలం

అరణియార్‌కు పూర్వ వైభవం తీసుకొస్తా..!

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



ప్రజాశక్తి-పిచ్చాటూరు: అరణియార్ ప్రాజెక్టుకు పూర్వ వైభవం తీసుకొస్తానని..ప్రాజెక్టు వద్ద తుడా నిధులు రూ.1.82 కోట్లతో బోటింగ్, చిన్న పిల్లల పార్కు, టవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అరణియార్ ప్రాజెక్టుకు పర్యాటక శాఖ సహకారంతో హోటల్ ఏర్పాటు, అభివద్ధి పనులు చేసి పర్యాటకుల సంఖ్య పెరిగేలా చూస్తామన్నారు. తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడా పరిధిలోని 22 మండలాల్లో అభివద్ధికి సహకారం అందిస్తున్నారని కొనియాడారు. సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని భూపతేశ్వరకోన కోన, కైలాసకోన, సిద్దలయ్య కోన వంటి పర్యాటక ప్రాంతాలకు తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలోనే మత్స్యకారుల అభివద్ధి కోసం ఇప్పటివరకు 30 లక్షల చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. జైకా నిధులు రూ.39 కోట్లతో అరణియార్‌ను పూర్తిస్థాయిలో అభివద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రేఖా, వైసీపీ మండల కన్వీనర్ హరిశ్చంద్రారెడ్డి, గవర్ల కష్ణయ్య, అపరంజిరాజు, కె.వి.భాస్కర్‌నాయుడు, సర్పంచ్ రోస్ రెడ్డి , ఎంపీటీసీలు రమేష్‌రాజు, వేలు, శోభన్, బేబీ, నాయకులు పాలపద్మనాభం, తొప్పయ్య, ఏపీఎం బాలాజీ రెడ్డి, లాలిబాబు యాదవ్, చిన్నదొర, బాబురెడ్డి, చెంగల్రాయల్‌రెడ్డి, చలపతిరాజు, సుబ్రమణ్యంరెడ్డి, మెహన్, ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ మధుసూదన్, సీఐ సురేష్ కుమార్, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, ఎంఈవో హేమమాలిని పాల్గొన్నారు.

'మా నమ్మకం..నువ్వే జగన్'



ప్రజాశక్తి-ఓజిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న అభివద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలంతా మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని సర్పంచులు చల్లా హంసవేణి, శంకు సుజాత, ఏకశిరి గోపాలయ్య, ఉచ్చూరు హరినాథ్ రెడ్డి కోరారు. శనివారం కిలివేటి సంజీవయ్య సూచనలు మేరకు మండల పరిధిలోని భువనగిరిపాలెం, ముమ్మాయిపాలెం, తిరుమలపుడి, మానమాల గ్రామాల్లో శనివారం సర్పంచులు, గృహ సారథులు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ స్టిక్కర్లను అంటించారు. వైసీపీ నాయకులు, మహేంద్ర , రాములు నాయుడు, భాస్కర్, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: గూడూరులోని ఒకటో సచివాలయం పరిధిలో వైసీపీ కన్వీనర్ దాసరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని.. మళ్లీ జగనన్ననే ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు దాసరి వెంకటేశ్వర్లు, షేక్ బాబు, ధనమ్మ, గహసారధులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట రెండో వార్డులోని భరత్ నగర్‌లో శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని కౌన్సిలర్ పాలేటి నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రంలో జగనన్న, నియోజకవర్గంలో సంజీవన్న అధికారంలోకి వస్తేనే మంచి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ ముత్యాలరెడ్డి, వాలంటీర్లు గహ సారథులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



ప్రజాశక్తి-గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో రూరల్ పరిధిలోని వాలంటీర్లు, పొదుపు సంఘాల మహిళలతో ఎమ్మెల్యే వరప్రసాద్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదలు గౌరవంగా జీవించాలంటే సీఎం జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చూడాలన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించి పార్టీ కాల్ సెంటర్ కి లబ్ధిదారుల నుంచి కాల్ చేయించాలని కోరారు. సమావేశంలో శ్రీ హరి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: చిల్లకూరులో శనివారం అసైన్మెంట్ కమిటీ కి సంబంధించిన భూములు సాగు చేస్తున్న ప్రతిఒక్కరికీ పట్టాలు ఇస్తామని అర్జీల స్వీకరిస్తూ ఎమ్మెల్యే వరప్రసాద్, ఎమ్మెల్సీ కళ్యాణ్ తెలిపారు. జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలు అమలు చేశామని వివరించారు. పేదలు సాగు చేస్తున్న భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ కళ్యాణ్ మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన పరిపాలన సంస్కరణలు ప్రజలు మరువరానివని పేర్కొన్నారు. ఆర్డీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాసేవలో బాధ్యతగా ముందుంటానన్నారు. తహశీల్దారు అస్మతుల్లా ఖాన్ , జడ్పీటీసీ మన్నెం శ్రీనివాసులు, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికీ అందేలా అవగాహన కల్పించాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శనివారం కోట వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘ సభ్యులు, గ్రామ వాలంటీర్లతో సమావేశం జరిగింది. ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందిస్తోందన్నారు. సకాలంలో తీసుకున్న రుణాలను బ్యాంకులో నగదు జమ చేసే విధంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. వైసిపి మండల కన్వీనర్ సంపత్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు షేక్.మొబిన్ బాషా, శ్రీరామ్, గురుస్వామి, చిట్టేడు సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, పొదుపు సంఘ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



ప్రజాశక్తి-దొరవారిసత్రం: కుప్పారెడ్డిపాలెం గ్రామ సమీపంలోని 'మెహర' అనాధ శరణాలయంలోని అనాథలకు శనివారం చింతవరం గ్రామానికి చెందిన జాన్ అను చిన్నారికి జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. చిన్నారి తాత మావిళ్లపాడు గ్రామానికి చెందిన పాలరమేష్ సహకారంతో నిర్వహించారు. రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ తహశీల్దారుగా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దారుగా శనివారం ఉదయం టీవీ సుబ్రహ్మణ్యం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సత్యవేడులో పనిచేస్తూ బదిలీపై బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయానికి సమస్యలకు పరిష్కారం చూపుతామని వివరించారు.

17 నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 17 నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వీ కుమార్ తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన వారు ఉచిత శిక్షణలో చేరాలని.. ఎస్ఎస్‌సీ హాల్ టిక్కెట్ జిరాక్స్ తీసుకొని కళాశాలకు రావాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్‌నంబర్లు 9010 222155, 9502078159లను సంప్రదించాలని కోరారు.

హోంగార్డుల సమస్యలకు పరిష్కారం



ప్రజాశక్తి -గూడూరు: హోంగార్డుల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చంద్రమోహన్ అన్నారు. శనివారం ఆయన హోంగార్డులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల కోసం కాంగ్రెస్ ధర్నా



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి చిత్తూరు జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి బాట పట్టించిన కాంగ్రెస్ పార్టీ నిండుకుండలా వ్యవహరిస్తుందని, దేశాన్ని అభివృద్ధి చేశామని.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామంటున్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేవలం ప్రచారాలకు మాత్రమే పనిచేస్తున్నాయని పీసీసీ కార్యదర్శి యార్లపల్లి గోపి విమర్శించారు. శనివారం పెండింగ్ ప్రాజెక్టులపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి బాట పట్టించడానికి కోట్ల రూపాయల నిధులు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామణి తీసుకొచ్చారన్నారు. జాతీయ రహదారులు, మన్నవరం బెల్ ఫ్యాక్టరీ, దుగరాజపట్నం ఓడరేవు, శ్రీసిటీలో పరిశ్రమలు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ హాయంలోనే జరిగాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు షేక్ జావేద్, లీగల్ సెల్ రవి, తేజోవతి, శాంతి యాదవ్, పటేల్, వెంకటేష్ గౌడ్, మహేష్ రాయల్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఈతకెళ్లి వ్యక్తి మృతి



ఫైల్ ఫొటో

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : సరదాగా ఈత కొట్టడాని చెరువులో దిగి వ్యక్తి మృతి చెందాడు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. తిరుపతి గిరిపురానికి చెందిన వేణుగోపాల్ కుమారుడు రెడ్డి ప్రసాద్(44) శుక్రవారం మధ్యాహ్నం ఇంటి వద్ద నుండి స్నేహితులతో కలసి విహారయాత్రకు అని సదాశివకోన సమీపంలో స్నేహితుడుకి చెందిన మామిడి తోటను సందర్శించి రావడానికి వెళ్లారు. అనంతరం మామిడి తోటలో భోజనం చేసి శుక్రవారం సాయంత్రం కొత్త చెరువు నీటిలో ఈత కొట్టడానికి చెరువులో దిగగా మధ్యలో ఈత కొట్టలేక ఆవతలి ఒడ్డు సమీపంలో మునిగిపోయాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం అతని ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. దీంతో శనివారం చెరువులోని మట్టిలో పాతుకొని ఉండటం చూసి బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు ముద్దాయిల అరెస్టు

- రూ.4.5 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు పోలీసు డివిజన్ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న గుంటూరు జిల్లా ముప్పాల మండలంలోని మాదాల గ్రామానికి చెందిన ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ కథనం మేరకు.. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాలతో పుత్తూరు డీఎస్పీ రామరాజు పర్యవేక్షణలో వడమాలపేట మండలంలోని పూడి గ్రామంలో ఉన్న టీటీడీ విశ్రాంత భవనం వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. ఈ సమయంలో టీటీడీ బస్ స్టాప్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని పట్టుకుని విచారంచగా పిచ్చాటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు ఇళ్లల్లో, వడమాలపేట పరిధిలోని ఓ దుకాణంలో దొంగతనం చేసినట్లు నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.4.50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ సురేష్ కుమార్ తెలిపారు. మహంకాళీ, కోటయ్య, నాగరాజు, వెంకటేశులు, దుర్గారావులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వడమాలపేట ఎస్సై రామాంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి(పిచ్చాటూరు), సునీల్ (కేవీబీపురం), సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి




ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని తిన్నేలపూడి రైతు భరోసా కేంద్రంలో మండల పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు మట్టి నమూనాలను సేకరించడం, వాటి ప్రయోగాలపై ఏవో నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఏడీఏ ఉమ పాల్గొని భూసార పరీక్షలతో కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది నిరంజన్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



గూడూరు: పోటుపాలెం రైతు భరోసా కేంద్రంలో మట్టి పరీక్ష వారోత్సవాలలో భాగంగా మండల స్థాయి భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ ఎందుకు చేసుకోవాలి.. ప్రాముఖ్యతను తెలియజేశారు. ఏడీఏ బి.గోపి నాయక్, ఏవో రమేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై కరపత్రాల పంపిణీ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా శనివారం రెండోరోజు అగ్నిమాపక సిబ్బంది పుత్తూరులోని పలు కార్యాలయాల్లో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలందరూ సూచనలు పాటిస్తే ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఉమాపతి, గిరిధర్, విశ్వనాధ్, చంద్రశేఖరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.